క్లుప్తంగా

శ్రీరామాలయ ప్రతిష్ఠ ప్రారంభం



ప్రతిష్ఠ మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న అర్చకులు, పెద్దలు

బలిజిపేట: మండలంలోని బడేవలసలో శ్రీరామాలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. అందులో భాగంగా మంగళవారం యర్ల రాంబాబు శాస్త్రి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ మహాగణపతి పూజ, ప్రతిష్ఠా సంకల్పం, పుణ్యావాహచనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశన, యాగశాల ప్రవేశం, సంస్కారం, అంకురారోహణ, నవగ్రహ, యోగిని, వాస్తు, క్షేత్ర పాలక సర్వతో భద్ర మంటప, మండల ఆవాహనములు, ఆరాధనలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మినీ గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని మినీ గురుకులం, పాచిపెంట పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఒకటవ తరగతిలో ప్రవేశానికి, 2 నుంచి 7వ తరగతి వరకు ఉన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకురాలు ఆర్.కృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మినీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పాచిపెంట గురుకులంలో మే 26లోగా దరఖాస్తులు అందజేయాలని చెప్పారు. ఒకటవ తరగతిలో 30, రెండవ తరగతిలో 11, మూడవ తరగతిలో 9 ఖాళీలున్నాయని, మరిన్ని వివరాలకు కన్వీనర్ నంబర్ 9441463451ను సంప్రదించాలని స్పష్టం చేశారు.

50మందికి ఉచిత వైద్యపరీక్షలు



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యబృందం

బలిజిపేట: బలిజిపేటలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 50మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. బలిజిపేట సత్యసాయి సేవాసమితి కన్వీనర్ వి.సుబ్బారావు ఆధ్వర్యంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన ఉచితవైద్య శిబిరానికి 50మంది హాజరవగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన 27మందికి విశాఖలో ఆపరేషన్లు చేయించి తిరిగి బలిజిపేట తీసుకురానున్నామని క్యాంప్ కోఆర్డినేటర్ వెంకట్ తెలిపారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశామని కన్వీనర్ సుబ్బారావు తెలిపారు. కార్యక్రమంలో బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి, ఏఎస్సై వీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న డాక్టర్ పి.రమసాయి

సీతానగరం: గ్రామాల్లో వివిధ రకాల వ్యాధులతో ఇబ్బందులకు గురవుతున్న వారికి సేవలందించడానికి ఆశ కార్యకర్తలు అందుబాటులో ఉండాలని డాక్టర్ పి.రమ్యసాయి అన్నారు. ఈ మేరకు మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్ జి.వరలక్ష్మి అధ్యక్షతన మంగళవారం ఆశ వర్కర్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రమ్యసాయి మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున వైరల్‌జ్వరాలు వచ్చే అవకాశం ఉందన్నారు.అలాగే గర్భిణుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని కోరారు. అత్యవసర మందులను ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తల వద్ద ఇప్పటికే ఉంచినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


కొండచిలువ హతం



హతమార్చిన కొండచిలువ

సీతానగరం: మండలంలోని కృష్ణారాయపురంలో రైతులు పొలం పనుల్లో నిమగ్నమైన సమయంలో మడిగట్టు నుంచి 6.6 అడుగుల కొండచిలువ చెరువులో వెళ్తున్నట్లు గుర్తించిన రైతు వెంకటరమణ కర్రతో మోది హతమార్చాడు. మంగళవారం ఉపాధి పనుల కోసం పొలంలో వెళ్తుండగా కొండచిలువ వెంకటరమణ కంటపడింది.

చింతతో.. ఆరోగ్యం చెంతనే



బలిజిపేట: చింత చిగురే కదా అని తేలికగా తీసిపారేస్తాం. అది ఆరోగ్యానికి ఎంత ప్రయోజనం చేకూరుస్తుందో వైద్యులను అడిగితే తెలుస్తుంది. చింత చిగురుతో రుచికరమైన వంటకాలను తయారుచేసుకోవచ్చనేది మగువలకు తెలిసిన విషయమే. వేసవి సీజన్ ప్రారంభమైందంటే కొంతమంది చింత చిగురు కోసం అన్వేషిస్తారు. చింత చిగురుతో వండిన వంటల రుచే వేరు. సీజన్‌లో వచ్చే చింత చిగురును మార్కెట్లో విక్రయానికి ఉంచుతారు. ఒకప్పుడు చెట్ల కిందకు వెళ్లి చింత చిగురును వెతుక్కుని వాటిని కోసుకుని ఇంటికి తీసుకువచ్చి పప్పు తయారుచేసి భోజనం ఆరగించి ఎంతో సంతృప్తి చెందేవారు. ఈ చింతను ఆహారంలో తీసుకుంటే చాలా ప్రయోజనాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

చింత చిగురుతో ఉపయోగాలివే

చింతచిగురు పప్పు వండుకుని కానీ పచ్చిగానైనా తినవచ్చు. చింత చిగురులో డైటరీ ఫైబర్‌పుష్కలంగా ఉంటుంది. దీంతో ఇది సహజసిద్ధమైన లాక్సేటివ్‌గా పనిచేస్తుంది. ఫినాల్స్ యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండడంతో చింత చిగురు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. చిగురును ఉడికించిన నీటిని పుక్కలిస్తే గొంతు నొప్పి, మంట, వాపు తగ్గుతాయి. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు చింత చిగురులో ఉండడమే ఇందుకు కారణం. కడుపులో నులిపురుగులతో బాధపడుతున్న చిన్నారులకు చింత చిగురుతో చేసిన వంటలు తినిపిస్తే ఫలితం ఉంటుంది. జీర్ణాశయ సంబంధ సమస్యలను తొలగించడంలోనూ చింత చిగురు బాగా ఉపయోగపడుతుంది. చిగురులో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను పటిష్టపరుస్తాయి. తరచూ చింత చిగురును తినడం వల్ల ఎముకలు దృఢత్వాన్ని సంతరించుకుంటాయి. థైరాయిడ్‌తో బాధపడేవారు చింత చిగురును ఆహారంలో తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.



చిగురుతో ఉన్న చింతచెట్టు

గుండె జబ్బులను చింతచిగురు దరి చేరనీయదు. శరీరంలో ఎర్ర రక్తకణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందించడమే కాకుండా రక్తాన్ని శుద్ధి చేస్తుంది. అవకాశం ఉన్నంతవరకు దీనిని వినియోగించుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

చింత చిగురులో పోషకాలు

సీజనల్ చింత చిగురు తీసుకుంటే మంచి ఆరోగ్య పోషకాలు అందుతాయి. వేసవిలో అందుబాటులో ఉండే చింత చిగురును తప్పకుండా వంటకాల్లో కానీ, పచ్చిగా కానీ తీసుకోవచ్చు. అందులో సి విటమిన్ పుష్కలంగా లభిస్తుంది. కొన్ని జబ్బులకు చింత చిగురు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

– క్రాంతి కిరణ్మయి, వైద్యాధికారిణి, బలిజిపేట పీహెచ్‌సీ

20న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నాం



సమ్మె నోటీసును అందిస్తున్న యూనియన్ నాయకులు, ఆశ కారకర్తలు



పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సమ్మె నోటీసును ఇస్తున్న ఆశావర్కర్లు

సాలూరు: ఆశ కార్యకర్తలను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్న డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు తెలిపారు. ఈ మేరకు సమ్మె నోటీసును మంగళవారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రి పీపీ యూనిట్ వైద్యాధికారికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశ కార్యకర్తలుగా మార్పుచేయాలి. ఒప్పంద జీఓలు విడుదల చేయాలి. లేబర్‌కోడ్స్ రద్దు చేయాలి. ఆశవర్కర్స్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకురాళ్లు రామలక్ష్మి, రాధ, అనిత, మాధవి, సీఐటీయూ నాయకుడు ఎన్‌వై నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: క్షేత్రస్థాయిలో నిరంతరం వైద్యాశాఖాపరమైన సేవలందిస్తున్న ఆశవర్కర్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు నిరసనగా చేపట్టనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జీవీ రమణ అన్నారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పి.ఉషారాణికి ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న సమ్మె నోటీసును ఆశ కార్యర్తలు మంగళవారం అందజేశారు.

సమ్మెను విజయవంతం చేయండి

పార్వతీపురం రూరల్: ఆశవర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశ కార్యకర్తలుగా మార్పుచేయాలి. అలాగే ఒప్పంద జీఓలను విడుదల చేసి నియామకాలు ప్రభుత్వం చేపట్టాలని, లేబర్ కోడ్స్ రద్దుచేసి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలనే ప్రధానమైన డిమాండ్స్‌తో కేంద్రకార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 20న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెలో ఆశ కార్యకర్తలందరూ పాల్గొంటారని సీఐటీయూ నాయకుడు సూర్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలోని పలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్యులకు సమ్మె నోటీసును ఆశవర్కర్ల ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిమాండ్ల పరిష్కారానికి చర్యలు చేపట్టే విధంగా ముందుకు వచ్చి తీరాలని కోరారు.

మక్కువలో..

మక్కువ: ఆశ వర్కర్లకు పని భారం తగ్గించి కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.వై.నాయుడు అన్నారు. ఈ మేరకు మక్కువ మండలంలోని మక్కువ, శంబర పీహెచ్‌సీల వద్ద మంగళవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ప్రభుత్వ పథకాలు అందించాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. రిటైర్ అవుతున్న వారికి బెనిఫిట్స్, కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఆశ వర్కర్ల సంఘం నాయకులు లక్ష్మి, సీత, సీఐటీయూ మండల కార్యదర్శి జి.కష్ణ పాల్గొన్నారు.

వన్‌స్టాప్ సెంటర్ ద్వారా వేధింపుల పరిష్కారం

- రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి

పార్వతీపురం రూరల్: మహిళలపై వేధింపులను నియంత్రించేందుకు వన్‌స్టాప్ సెంటర్లు దోహదపడతాయని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి పేర్కొన్నారు. మహిళా సాధికారతే ధ్యేయంగా వన్‌స్టాప్ సెంటర్ల(సఖి)ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం జిల్లా కేంద్రంలోని అజయ్‌నగర్‌లో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన్‌స్టాప్ సెంటర్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలపై జరిగే వేధింపులు, వివక్ష నుంచి రక్షణ కల్పించేందుకు వన్‌స్టాప్ సెంటర్ ఉపయోగపడుతుందని, ఈ సెంటర్లలో బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు, అలాగే లీగల్ అడ్వైజర్, సోషల్ వర్కర్స్ సెంటర్ మేనేజర్‌తో పాటు పలువురు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రధానంగా గృహహింస, పనిచేసే ప్రాంతాల్లో మహిళల వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులను ఇక్కడ స్వీకరిస్తారని తెలిపారు.



వన్‌స్టాప్ సెంటర్ (సఖి)కేంద్రాన్ని సందర్శించిన రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి

నవధాన్యాలతోనే భూసారం



రైతుల కోసం సిద్ధం చేసిన నవధాన్యాల సంచులు

పార్వతీపురం రూరల్: ప్రతి రైతు నవధాన్యాలను ఉపయోగించడం వల్ల వ్యవసాయ భూముల్లో భూసారం పెరుగుతోందని ఏపీ సీఎన్‌ఎఫ్ అధికారులు, సిబ్బంది పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లిలో రైతులకు నవధాన్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి రమణమ్మ మాట్లాడుతూ వ్యవసాయభూముల్లో పంటలు వేసే ముందు ఎకరాకి పది కేజీల నవధాన్యాలను వేయడం వల్ల కార్బన్ శాతంతో భూసారం పెరుగుతోందని, దీనివల్ల రసాయన ఎరువులు అధికంగా ఉపయోగించాల్సిన అవసరం లేదని, వరి పంటతో పాటు అపరాల పంటలకు అధిక దిగుబడి వస్తుందని చెప్పారు. చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతికి చెందిన విత్తనాలతో కలిపివేయడం వల్ల వచ్చే ఉపయోగాలను రైతులకు వివరించారు. నవధాన్యాలతో జీబీఎస్‌ఎఫ్ చక్రం వేసి రైతులకు వివరించారు. అలాగే విత్తనాలను రైతులకు ఆర్‌బీకేల ద్వారా అందుబాటులో ఉంచనున్నట్లు ఆమె తెలిపారు.

తల్లి సమాధి వద్ద మాజీ ఎమ్మెల్యే నివాళులు

బలిజిపేట: బలిజిపేట మాజీ ఎంపీపీ అలజంగి సంతోషమ్మ తృతీయ వర్ధంతి సందర్భంగా మండలంలోని చిలకలపల్లిలో ఆమె సమాధి వద్ద కుమారుడు, మాజీ ఎమ్మెల్యే జోగారావు మంగళవారం నివాళులర్పించారు. సమాధి వద్ద పూలమాలలు వేసి ప్రార్థించారు. ఆయనతో పాటు కుటుంబసభ్యులు, సోదరుడు జెడ్పీటీసీ ఎ.రవికుమార్ కుటుంబసభ్యులు సంతోషమ్మ సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ సంతోషమ్మ సేవలను పలువురు వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జోగారావు కుటుంబసభ్యులు

కిశోరీ బాలికలు ఆరోగ్యసూత్రాలు పాటించాలి

బలిజిపేట: కిశోరీ బాలికలు ఆరోగ్యసూత్రాలు పాటించాలని గలావల్లి పీహెచ్‌సీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు పీహెచ్‌సీలో కిశోరీ బాలికలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిశోరీ బాలికలు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. రుతుస్రావం సమయంలో జాగ్రత్తలు పాటించాలని, రక్తహీనతకు గురికాకుండా తగు చర్యలు చేపట్టాలని, ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే వైద్యసిబ్బందిని సంప్రదించాలని చెప్పారు. ఈనాటి ఆరోగ్య పరిరక్షణ రాబోయే రోజుల్లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న 9మంది ఆశ కార్యకర్తలకు ఒకొక్కరికి రెండు జతల వంతున 18యూనిఫారాలను అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గలావల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరావు

ఘనంగా కంతపోలమ్మ జాతర



జాతరలో పులివేషాలతో కళాకారులు

సీతానగరం:

మండలంలోని బగ్గందొరవలస గ్రామంతో పాటు వివిధగ్రామాల ప్రజలు ఇలవేల్పుగా పూజించే కంతపోలమ్మ అమ్మవారి జాతర ఘనంగా జరుగుతోంది. ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో సోమవారం అరంభమైన జాతర సందర్భంగా మంగళవారం సాయంత్రం పురవీధుల్లో సిరిమానోత్సవం,అంజలి రథంమాను, కోలాటం, తిరువీధి, బాజా భజంత్రీలు, పులివేషాలతో విన్యాసాలు చేసుకుంటూ అమ్మవారిఘటాలతో తిరువీధి జరిగింది.యువకులు వేసిన పులివేషాలు, బాలికలు చేస్తున్న కోలాటం పలువురిని ఆకర్షించాయి. బుధవారం ఉదయం అనుపోత్సవం, మొక్కులు తీర్చుకోవడం ఉన్నట్లు కమిటీ సభ్యులు తెలియజేశారు. రాత్రి వేళల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, జానపద కళారూపాలు నిర్వహించామని చెప్పారు. అమ్మవారిని పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రజాసంఘాలనేతలు దర్శించుకున్నారు.



జాతరలో పులివేషాలతో కళాకారులు



పురవీధుల్లో సిరిమానోత్సవంతో భక్తులను ఆశీర్వదిస్తున్న పూజారి

సేంద్రియ ఎరువు తయారీలో మెలకువలు పాటించాలి

సీతానగరం: మండలంలోని ఎస్‌డబ్ల్యూపీసీల్లో చెత్త నుంచి సంపద తయారీకి నిర్వాహకులు, సిబ్బంది మెలకువలు పాటించాలని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు గ్రామాల్లో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల పరిశీలనలో భాగంగా మంగళవారం ఆయన సూరంపేట, అంటిపేటలలో గల కేంద్రాల్లో సేంద్రియ ఎరువు తయారీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలభివృద్ధి చెందడానికి, ఆర్థికాభివృద్ధికి వీధులనుంచి సేకరించిన తడి, పొడి చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీలో శుద్ధి చేయడంతో ఎరువు తయారు చేయడానికి ఉపయోగ పడుతుందన్నారు. ఎరువు తయారీకి నిర్వాహకులు, సిబ్బంది అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఇప్పటికే పెదభోగిలి ఎస్‌డబ్ల్యూపీసీలో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఇక్కడ ఎరువు ఉత్పత్తి జరుగుతున్న విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళి, గ్రీన్‌అంబాసిడర్లు పాల్గొన్నారు.



అంటిపేట ఎస్‌డబ్ల్యూపీసీలో ఎరువుతయారీని పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ

తాటి ముంజుల్లో ఔషధ గుణాలు

- వేసవి తాపాన్ని తగ్గించి ఉపశమనం

పార్వతీపురం: వేసవితాపాన్ని తగ్గించి శరీరంలో ఉండే అనేక రుగ్మతలకు ఔషధంగా ఉపయోగపడతాయి తాటిముంజులు. దీనిని స్థానికులు ఐస్ యాపిల్‌గా పిలుస్తారు. లేలేతగా ఉంటే తాటిముంజులు అద్భుతమైన రుచితో నోరూరిస్తాయి. వేసవిలో విరివిగా లభించే తాటిముంజులకు మార్కెట్‌లో భలే గిరాకీ ఉంటుంది. తాటి ముంజులుకు దాహార్తిని తగ్గించే లక్షణం ఉండటంతో పాటు శరీరంలోని చక్కెర, ఖనిజ లవణాలను సమతుల్యం చేయనున్న కారణంగా వాటికి విపరీతమైన గిరాకీ ఉంటుంది.

ఆరోగ్య రక్షణగా..

ప్రకృతిలో లభించే తాటి ముంజులు కల్తీలేని, స్వచ్ఛమైనవి కావడంతో ఆరోగ్యరక్షగా వాటిని పిలుస్తారు. జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ, గరుగుబిల్లి, బలిజిపేట తదితర మండలాలల్లో మెట్టు ప్రాంతాలలో తాటిచెట్లు ఉన్నప్పటికీ తాటికాయలను చెట్టు నుంచి దించే కార్మికుల కొరత ఉంది. చెట్టునుంచి తాటిముంజులు సేకరించేవారు తక్కువ కావడంతో గ్రామీణ ప్రాంతాలలో ఉన్న కూలీల సహాయంతో పట్టణ ప్రాంతాలకు తరలించి విక్రయిస్తుంటారు.





తాటిముంజులను కాయలను వేరుచేస్తున్న గీత కార్మికుడు, (ఇన్‌సెట్లో) తాటిముంజులు

సీజనల్‌గా ప్రతి ఒక్కరూ తీసుకోవాలి



వేసవినుంచి వర్షాకాలం ప్రారంభంవరకూ లభ్యమయ్యే తాటిముంజులను తినడంవల్ల మంచి ఆరోగ్యం లభిస్తుంది. తాటిముంజులలో పోషకాలు అధికంగా ఉండడం వల్ల వ్యాధి నిరోధకశక్తి ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుత సీజనల్‌లో లభించే సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తీసుకోవాలి.

– డా.ఎస్ఎంకే తిరుమల ప్రసాద్, వైద్యాధికారి, పీహెచ్‌సీ, బందలుప్పి

సర్వేలు పక్కాగా నిర్వహించాలి

మక్కువ: ప్రజారోగ్య సర్వేలు పక్కాగా నిర్వహించాలని వైద్యా రోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు మక్కువ మండలంలోని మక్కువ, శంబర పీహెచ్‌సీల్లో మంగళవారం నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి సంబంధించి ఇంటింటి సర్వే, గర్భిణుల నమోదు, కాన్పు వివరాలు, కుటుంబ నియంత్రణ, సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. బాల్యంలో పిల్లల ఆరోగ్య సంరక్షణ, ఎదుగుదల క్రమంలో ఆరోగ్య సమస్యలు, లోపాలు ముందుగానే గుర్తించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో జ్వరాలు గుర్తించడంలో జాప్యం ఉండరాదని ఫీవర్ సర్వే సక్రమంగా నిర్వహించాలని కోరారు. దోమల నివారణకు ప్రస్తుతం కొనసాగుతున్న ఐఆర్‌ఎస్ కార్యక్రమం పూర్తిస్థాయిలో జరిగేలా పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే సత్వరమే తెలియజేయడంలో ఆశ కార్యకర్తలు క్రియాశీలకంగా ఉండాలని హితవు పలికారు. గ్రామాల్లో ఆరోగ్య సేవలు అందుతున్న తీరు, ఆరోగ్య కార్యక్రమం అమలుపై సమీక్షించారు. ప్రగతి నివేదికలు, ఆశ సర్వే రికార్డ్స్ పరిశీలించారు. కార్యక్రమంలో మక్కువ, శంబర పీహెచ్‌సీల వైద్యాధికారులు జి.హరికృష్ణ, ఎంవీ కిరణ్ కుమార్, ఎపిడమిక్ ఈవో సత్తిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు

ఎంఎల్‌హెచ్‌పీలు మాటలు వెనక్కి తీసుకోవాలి

పార్వతీపురంటౌన్: ఎంఎల్‌పీహెచ్, సీహెచ్‌ఓలు వారం రోజులుగా హక్కుల కోసం చేస్తున్న నిరసనలో భాగంగా ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్స్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని ఏపీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్‌ఎస్ కిశోర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఏపీఎన్‌జీఓ హోంలో మెడికల్ అండ్ హెల్త్ జేఏసీ, మన్యం జిల్లా అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌ఓల వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీఓ 143ను రద్దు చేసి వెంటనే బదిలీలు చేపట్టాలని కోరారు. పెండింగ్ ప్రమోషన్స్ ఇవ్వాలని, ఫీల్డ్‌స్టాఫ్‌కు ఎఫ్ఆర్ఎస్ మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బి.చిన్నమ్మి, బి.పుష్ప, ఎస్.లలితకుమారి, జయలక్ష్మి, భవాని, కె.రాణి, జ్యోతిలక్ష్మి, దుర్గాప్రసాద్, జయగౌడ్, పార్వతి, రవణమ, జిల్లా వ్యాప్తంగా మెడికల్ అండ్ హెల్త్ ఉద్యోగులు 350మంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్‌ఎస్ కిశోర్